

రంజాన్ వేళలు		
	ఇఫ్తార్ (గురు)	సా.6.24
	సహరి (శుక్ర)	ఉ.4.39

పంట చేలకు సాగునీటి కొరత

- పొలాల్లో మోటారుసైకిళ్లు నడిపి రైతుల నిరసన
- ఎండిపోతున్న వరిచేలు.. పట్టించుకోని అధికారులు
- తాళ్లరేవు మండలం గ్రాంటులో రైతుల ఆవేదన



ఇంకా పెత్తనమేంటి?

I-PAC
INDIAN POLITICAL ACTION COMMITTEE

- జిల్లాలో ఐప్యాక్ బృందాల పెత్తనంపై వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల కుతకుత
- నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ ఎంత పంచాలో లెక్కలేసి ఐప్యాక్ నివేదికలు
- బలహీన ఓటు బ్యాంకు ప్రాంతాలపై దృష్టిపెట్టడం లేదంటూ సతాయింపులు
- టీడీపీలో చేరిన వారిని వెనక్కు తీసుకురావాలంటూ పదేపదే ఒత్తిళ్లు
- నయానోభయానో బెదిరించి తిరిగి పార్టీలో చేర్చుకోవాలంటూ సలహాలు
- అనుకున్న లెక్కలకు వ్యతిరేకంగా ఐప్యాక్ ఆదేశాలతో అభ్యర్థుల్లో ఆగ్రహం
- ఈ ఐదేళ్లలో పార్టీకి చేసిన నష్టం చాలక తమపై పెత్తనంపై భగభగ
- అధిష్ఠానం పంపిన బృందాల తీరుతో తలపట్టుకుంటోన్న వైసీపీ ఎమ్మెల్యేలు


(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడిన వేళ ఐప్యాక్ బృందాల తీరుతో జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు తలపట్టుకుంటున్నారు. నియోజకవర్గాలపై బృందం సభ్యులకు పెద్దగా పట్టులేకపోయినా తమ నెత్తినెక్కి తాండవం చేస్తుండడం తట్టుకోలేకపోతున్నారు. ఐదేళ్లలో ప్రభుత్వానికి చేయాల్సినంత నష్టం చేసి ఇప్పుడు ఎన్నికల సమయంలో కూడా తమపై పెత్తనం చేయడంపై దిగమింగుకోలేకపోతున్నారు. ఎన్నికల్లో నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ ఎంత పంచాలి? ఎవరితో పంచాలి అంటూ లెక్కలేసి మరీ సదరు అభ్యర్థులకు నివేదికలు ఇస్తుండడంతో గుర్రుమంటున్నారు. తమకు కొత్తగా రాజకీయాలు నేర్పుతున్న ఐప్యాక్ తీరుపై కుతకుతలాడుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతో నియోజకవర్గాల్లో వందలాది మంది వైసీపీ నేతలు, క్యాడర్ కొన్నినెలలుగా టీడీపీలో చేరిపోయారు. ఇప్పుడు వారిని ఎలాగైనా వెనక్కు తేవాలంటూ ఐప్యాక్ ఒత్తిడి తెస్తుండడంతో సదరు అభ్యర్థులు ఐప్యాక్ తీరుతో తలలు పట్టుకుంటున్నారు. జరగని పని చేయాలంటూ నివేదికలు అధిష్ఠానానికి పంపుతుండడంతో నెత్తీనోరు బాదుకుంటున్నారు. తమ రాజకీయ వ్యూహాలకు అడుగడుగునా అడ్డు తగులుతూ సతాయిస్తుండడంపై రగిలిపోతున్నారు.

చెప్పినట్లు చేయాల్సిందే..

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడిన తరుణంలో అధికార వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ జనంలోకి వెళ్లడం కంటే ప్రలోభాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఓట్లకోసం ఇంటింటికీ వెళ్తుంటే నిరసనలు, నిలదీతలు ఎదురవుతుండడంతో అడ్డదార్లు ఎంచుకుంటున్నారు. వలంటీర్లకు డబ్బులు, గిఫ్టులు, ఇతర ప్రలోభాలకు గురిచేస్తూ ఓట్ల వేట సాగిస్తున్నారు. గ్రామాల్లో పార్టీ దిగువస్థాయి క్యాడర్, నేతలు, గ్రామ పెద్దలకు ఎక్కడికక్కడ విందులు, వినోదాలతో రంజింప చేస్తున్నారు. తద్వారా ప్రజావ్య తిరేకతనుంచి ఎంతోకొంత తప్పించుకోవడానికి అడ్డదారి వ్యూహాలు అమలు చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో వీరికి ఐప్యాక్ టీంలు చుక్కలు చూపిస్తుండడంతో ఆయా నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు తలపట్టుకుంటున్నారు. తాము చేస్తున్న రాజకీయానికి పూర్తి వ్యతిరేకంగా వ్యూహాలు, సూచనలు, సలహాలు ఇస్తుండడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. కొందరు అభ్యర్థులైతే ఐప్యాక్ టీంలతో లాభం కంటే నష్టం ఎక్కువగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ప్రధానంగా నియోజకవర్గాల్లో ఏయే మండలంలో ఏగ్రామాల్లో పార్టీ అత్యంత బలహీనంగా ఉందో గుర్తించి అక్కడ ఎన్నికల సమయంలో ఎంత పంచాలి? ఎవరికి పంచాలి? ఎవరితో పంచేలా చూడాలి? అంటూ ఇటీవల కొన్ని నివేదికలను ఆయా అభ్యర్థులకు అందించింది. ఆయా గ్రామాల్లో బలమైన నాయకులు, క్యాడర్ ఇటీవల టీడీపీలో భారీఎత్తున చేరిపోయినట్లు ఐప్యాక్ బృందాలు గుర్తించాయి. జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని, కాకినాడ రూరల్, పెద్దాపురం నియోజకవర్గాల్లో నష్టం ఎక్కువగా జరిగినట్లు తేల్చింది. ఈ నేపథ్యంలో వారందరినీ ఏదోలా వెనక్కు తీసుకురావాల్సిందేనని అభ్యర్థులపై ఒత్తిడి తెస్తోంది. నయానోభయానో ఒప్పించి తీరాలంటూ హుకుం జారీచేస్తోంది. దీంతో ఆయా అభ్యర్థులు రగిలిపోతున్నారు. జరగని పని ఎలా చేయడం అంటూ ఐప్యాక్ తీరుపై మండిపడుతున్నారు. ఇలా బతిమాలుకుంటే ఓడిపోయినట్లు ముందే అంగీకరించినట్లవుతుందని, అదీ కాకుండా పార్టీలో ఉన్న క్యాడర్ ముందు పరువుపోతుందని సదరు అభ్యర్థులు తలపట్టుకుంటున్నారు. కానీ ఐప్యాక్ మాత్రం పార్టీ అధిష్ఠానానికి నివేదికలు పంపుతోంది. తిరిగి ఇవి సదరు అభ్యర్థుల వద్దకు వస్తుండడంతో వీరంతా రగిలిపోతున్నారు. ఐప్యాక్‌కు అసలు నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యూహాలు తెలియకుండా తమపై బలవంతంగా రుద్దుతున్న తీరుపై చిటపటలాడుతున్నారు. తమ రాజకీయ వ్యూహాలను పక్కనపెట్టి ఐప్యాక్ చెప్పిందల్లా చేస్తే చేటు తప్పదేమోనని కలవరపడుతున్నాయి. ఇప్పటికే జగన్ పాలనపైనా, ఎమ్మెల్యేల పనితీరుపైనా తప్పుడు నివేదికలను ఐప్యాక్ ఇవ్వడంవల్లే ఈ రోజు ఇంత వ్యతిరేకత ఉందని, ఇప్పుడింకా తప్పుడు సలహాలతో తమ కొంప ముంచేస్తోందని ఎమ్మెల్యే అభ్యర్థులు నెత్తీనోరుబాదుకుంటున్నారు. తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఈ తరహా సలహాలు ఎక్కువవడంతో ఐప్యాక్ తీరుపై సదరు నేతలు మండిపడుతున్నారు. వీరిలో కొందరైతే ఐప్యాక్ చెప్పినట్లు చేస్తే రాజకీయం చేయలేమని వారిని నివేదికలు పక్కన పడేస్తున్నారు. పార్టీలో నేతలు, ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం కంటే వీరిని మెప్పించడమే పనిగా పెట్టుకోవాల్సి వస్తుండడంపై కొందరు మింగలేక కక్కలేకపోతున్నారు. అధిష్ఠానంవల్లే తమపై పెత్తనం చేస్తున్నారంటూ కారాలు, మిరియాలు నూరుతున్నారు. దీన్ని పార్టీ పెద్దలకు చెప్పలేక, ఐప్యాక్‌తో గొడవపడలేక ఇంకెంతనష్టపోవాల్సి వస్తుందోనని మథనపడుతున్నారు.

మత్తుకు బానిస



- గంజాయి మత్తులో తేలియాడుతున్న యువకులు
- ఏజెన్సీ దారకొండ నుంచి జగ్గంపేటకు సరఫరా
- 25కిలోల చొప్పున దిగుమతి.. 30గ్రాముల చొప్పున ప్యాకింగ్
- తాజాగా ఇద్దరు అమ్మకందారులు, కొనుగోలుదారులు 10మంది అరెస్టు

జగ్గంపేట, మార్చి 27: యువత మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మద్యం, సిగరెట్, గుట్కా, పాన్ మసాలతోపాటు గంజాయి, డ్రగ్స్ వంటి వాటికీ అలవాటుపడి చెడిపోతున్నారు. జిల్లాలో గంజాయి వాడకం ఇప్పుడు అధికమైంది. స్థానికంగా ఎక్కడికక్కడ సిగరెట్ దొరికేంత ఈజీగా గంజాయి దొరకడమే దీనికి కారణం. 30గ్రాముల చిన్నప్యాకెట్లు ఎక్కడపడితే అక్కడే దర్శనమిస్తున్నాయి. కిల్లీకొట్టుల్లో సిగరెట్ అడిగినంత ఈజీగా గంజాయి ప్యాకెట్ అనగానే ఇచ్చే పరిస్థితి ఉంది. దీన్నిబట్టి గంజాయి వాడకం, అమ్మకం ఎంత జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

గంజాయి రాకపోకలు ఇలా..

మందు, సిగరెట్ కంటే గంజాయి ఎక్కువ మత్తు ఇస్తుందన్న భావనతో యువత దానికి ఎక్కువ ఆకర్షితులవుతున్నారు. అధికమొత్తంలో గంజాయి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు సైతం డబ్బుకు కక్కుర్తిపడి ప్రతిఒక్కరికీ వయస్సుతో సంబంధం లేకుండా గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా జగ్గంపేట పట్టణంలో జ్యోతులకాలనీ, శెట్టిబలిజపేట, గోకవరంరోడ్డుతోపాటు రామవరం, మర్రిపాక గ్రామాల్లో యువకులు ఈ గంజాయి అధికంగా తీసుకుంటున్నట్లు సమాచారం. ఏజెన్సీ ప్రాంతంలోని దారకొండ నుంచి ఇక్కడకు గంజాయి సరఫరా అవుతోందని తెలుస్తోంది. ఇది 25కిలోల చొప్పున దిగుమతి చేసుకుని 30గ్రాముల చొప్పున ప్యాకింగ్ చేస్తున్నారని చెప్తున్నారు. జగ్గంపేట శివారు రామవరం దగ్గర ఉన్న రంగవల్లినగర్ వెనుక ఖాళీ ప్రదేశంలో స్థావరం ఏర్పాటు చేసుకుని దాన్ని గంజాయి సరఫరా డెన్‌గా మార్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. గంజాయి ప్యాకింగ్ చేసిన తర్వాత యువకులు, వ్యాపారస్తులకు సమాచారమిస్తారు. వెంటనే యువకులు, చుట్టుపక్కల కిల్లీకొట్ల వ్యాపారస్తులు వెళ్లి ఆ ప్యాకెట్లు హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి బయటి యువకులకు ప్యాకెట్ రూ.300 చొప్పున అమ్మకం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ డెన్ ఏర్పాటు, గంజాయి అమ్మకానికి కొందరు పెద్దలు సహకరించినట్లు తెలుస్తోంది. కాకినాడ జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి సైతం జగ్గంపేట వచ్చి గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసి వెళ్తున్నారంటే ఇక్కడ అమ్మకం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క జగ్గంపేట పట్టణంలోనే 200మందికిపైగా యువత రోజూ గంజాయి సేవిస్తున్నట్లు స్థానిక సమాచారం. వ్యాపారులు రోజుకు లక్షల్లో వ్యాపారం చేస్తూ యువత జీవితాన్ని నాశనం చేస్తున్నారు. ప్రతిరోజూ ఏదొక చోట గంజాయి తరలింపును పోలీసులు అడ్డుకుంటున్నా యువత తీరు మారకపోవడం బాధాకరం. యువతను తల్లిదండ్రులు సైతం ఎప్పుడూ ఒక కంట కనిపెడుతూనే ఉండాలని పులువురు అభిప్రాయపడుతున్నారు.

తాజాగా పలువురి అరెస్టు

జగ్గంపేట మండలం రంగవల్లినగర్ వెనుక డెన్‌లో గంజాయి సరఫరా జరుగుతుందని తెలియడంతో పోలీసులు నిఘా పెట్టి తాజాగా ఇద్దరు అమ్మకందారులు, పది మంది స్థానిక యువకులను అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. ఆ పది మంది యువకుల్లో మైనర్లు ఉన్నారు. దీనిపై సీఐ లక్ష్మణరావును వివరాలు అడగ్గా పూర్తిస్థాయిలో నిఘా పెట్టామని వివరాలు వెల్లడిస్తే అసలైన నేరస్తులు తప్పించుకునే పరిస్థితి ఉందని తెలిపారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి గంజాయిని అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గంజాయి కేసులో చిక్కుకుంటే జీవితం నాశనమైనట్టేని, యువత చేతులారా బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు.

దివ్యాంగులకు, 85ఏళ్లు దాటిన వృద్ధులకు..

ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం

- జిల్లాలో అలాంటి వృద్ధులు 7,593మంది, దివ్యాంగులు 18,602మంది: జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 27: 85ఏళ్ల దాటిన వృద్ధులు, 40శాతం వైకల్యం మించిన దివ్యాంగులు ఇంటినుంచే ఓటుహక్కును ఉపయోగించుకునే నూతన ఒరవడికి ఎన్నికల సంఘం నాంది పలికిందని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఈ నూతన విధానం అమలులోకి వచ్చిందన్నారు. ఇప్పటివరకు వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడి అనేక ఇబ్బందులు పడేవారన్నారు. వీరికోసం భారత ఎన్నికల సంఘం ప్రత్యేక విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. నూతన మొబైల్ ఓటింగ్ వాహనం వారి ఇంటి వద్దకు వెళ్తుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ తరహాలోనే హోం ఓటింగ్‌కు కూడా ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తొలుతగా వీరిని బూత్ లెవెల్ అధికారులు గుర్తిస్తారన్నారు. వీరు ఫారం-12డి ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి దరఖాస్తు చేయాలన్నారు. తర్వాత వాటిని అధికారులు పరిశీలించి ఇంటివద్ద ఓటు ఎప్పుడు వేయాలో సమాచారం ఇస్తారన్నారు. జిల్లాలో 85ఏళ్ల పైబడిన వృద్ధులు 7,593 మంది ఉండగా దీనిలో పురుషులు 2966మంది, 4,627మంది మహిళలు ఉన్నారన్నారు. జిల్లాలో దివ్యాంగులు 18,602మంది ఉండగా దీనిలో 11,161మంది పురుషులు, 740 మహిళలు, ఒక్క థర్డ్ జండర్ ఉన్నారన్నారు.

85ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులైన ఓటర్ల వివరాలు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 27: జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా పరిశీలిస్తే 85ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులైన ఓటర్ల వివరాలను జిల్లాలో ఎన్నికల సంఘం అధికారులు విడుదల చేశారు. వీరు ఇంటినుంచే ఓటుహక్కును రహస్య బ్యాలెట్ విధానంలో ఉపయోగించుకుని అభ్యర్థుల గెలుపు ఓటమిలో కీలకపాత్ర పోషించనున్నారు. మొబైల్ ఓటింగ్ వాహనం వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల ఇంటివద్ద ఆగుతుంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రహస్య ఓటింగ్ విధానంలో ఓటు వినియోగిస్తారు. దీన్ని వీడియో గ్రాఫిక్ చిత్రీకరణ చేసి ఎన్నికల అధికారులు భద్రపర్చుతారు.

నియోజకవర్గం	వృద్ధులు	పురుషులు	మహిళలు	దివ్యాంగులు	పురుషులు	మహిళలు
తుని	916	299	617	2638	1044	1594
ప్రత్తిపాడు	1001	316	685	2497	1543	954
పిఠాపురం	846	301	545	2738	1723	1015
కాకినాడ రూరల్	1667	795	872	2252	1347	905
పెద్దాపురం	939	355	584	3009	1671	1338
కాకినాడ సిటీ	1149	516	633	2078	1557	920
జగ్గంపేట	1075	384	691	3390	2126	1264

సీవిజిల్ యాప్ దరఖాస్తులు తక్షణ పరిష్కారం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 27: జిల్లాలో సీవిజిల్ యాప్‌లో నమోదైన దరఖాస్తులను తక్షణమే పరిష్కరిస్తున్నామని కలెక్టర్ కృతికాశుక్లా అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా బుధవారం విజయవాడనుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్లా సీవిజిల్ యాప్, ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఫిర్యాదుల పరిష్కారంపై కమిషనర్‌కు వివరించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామన్నారు. సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదులను నిర్దేశించిన సమయంలోపు పరిష్కరిస్తున్నామన్నారు.

సోషల్ స్టడీస్ పరీక్షకు
28,343మంది విద్యార్థులు హాజరు: డీఈవో

కాకినాడ రూరల్, మార్చి 27: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి బుధవారం నిర్వహించిన సోషల్ స్టడీస్ పరీక్షకు 29,228 విద్యార్థులకుగాను 28,343మంది హాజరైనట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. జిల్లా పరిశీలకులు ఆరుగురు, డీఈవో నలుగురు, తనిఖీ అధికారులు 30 మంది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోను సోషల్ స్టడీస్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, ఈనెల 30తో పదో తరగతి పరీక్షలు ముగుస్తాయని తెలిపారు. కాంపోజిట్ తెలుగుపేపర్-2(సంస్కృతం)పరీక్ష జిల్లాలోని 68 పరీక్షాకేంద్రాల్లో గురువారం ఉదయం 9.30 నుంచి 11.15 గంటల వరకూ జరుగుతుందన్నారు.

కోడ్ కూసినా.. ఆగని తవ్వకాలు



తేటగుంట శివారు కొండ దిగువున గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం

- వైసీపీ నేతల కనుసన్నల్లో అక్రమ తవ్వకాలు
- రాత్రివేళల్లో యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- కళావిహీనంగా తూర్పు కనుములు

తుని రూరల్, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల కోడ్ కూసినా అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది. అధికారుల చోద్యం, పాలకుల అండదండలు దండుగా ఉండడంతో పచ్చని తూర్పు కనుములు కరిగి కళావిహీనంగా మారుతున్నాయి. తునిలో 16వ నెంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భూముల రేట్లకు రెక్కలు రావడంతో అక్రమార్కుల చూపు ఈ భూములపై పడింది. తేటగుంట, ఎర్రకోనేరు, గవరయ్య కోనేరు ప్రాంతాల్లో హైవేను ఆనుకుని కనువిందు చేసే పచ్చటి కనుమలు దిగువున ఫారెస్ట్ ట్రెంచ్‌ను ఆనుకుని ఉన్న ఆరకొర జిరాయితీ, పట్టా భూములను తక్కువ ధరలకు కొనుగోలు చేసి యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతూ పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కూడా ఆక్రమించేస్తున్నారంటూ ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

వైసీపీ నాయకుల అండదండలతో..

సహజంగా తేటగుంట శివారు జాతీయ రహదారిని ఆనుకుని కొండ దిగువున ఉన్న భూముల్లో రాత్రివేళల్లో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పోలీస్ శాఖలో ఓ ఉన్నతాధికారి సంబంధీకుల స్థలం కావడం, వైసీపీ నాయకుల అండదండలు ఉండడంతో ఆ వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలున్నాయి. రాత్రి వేళల్లో భారీ యంత్రాలు, లారీలు హల్‌చల్ చేయడంతో ఆ ప్రాంతం జాతరను తలపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. వీటి శబ్దాలకు రాత్రిళ్లు కంటి మీద కునుకు లేని పరిస్థితి దాపురించిందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ తవ్వకాలపై దృష్టిసారించి ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పెద్దఎత్తున కొండ గ్రావెల్ తరలింపు

ఈ ప్రాంతంలోనే లభ్యమయ్యే అరుదైన గ్రావెల్‌ను జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఎర్రకోనేరువద్ద నిబంధనలకు విరుద్ధంగా ఓ లే అవుట్‌కు తరలిస్తున్నారు. ఇప్పటికే వేలాది లారీల గ్రావెల్ మట్టిని తరలించి లేఅవుట్ చదును చేయడమే కాకుండా లే అవుట్‌ను ఆనుకుని ఉన్న కొండను సైతం వదలని అక్రమార్కులు కొండ జిరాయితీ స్థలం అంతా తమ ఇష్టమంటూ కొండను ఇరువైపులా తొలచివేస్తున్న తీరుపై ఆ ప్రాంత వాసుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

మాతృ మరణాల నివారణకు కృషి చేయాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

జీజీహెచ్(కాకినాడ), మార్చి 27: మాతృ మరణాలను నివారించి నూరుశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ కోరారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో మాతృ మరణాలపై జిల్లా సబ్‌కమిటీ సభ్యులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ మరణాల నివారణ కోసం కమ్యూనిటీ స్థాయి, ఫెసిలిటీ లెవల్‌లో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదకరపమైన పరిస్థితుల్లో ఉన్న గర్భిణులు తీసుకోవాల్సిన చర్యలు, ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండు కేసులు చోటుచేసుకున్నాయన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ రమాదేవి నోడల్ ఆఫీసర్ డాక్టర్ జయధీర్, డాక్టర్ పద్మజ, డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, డాక్టర్ పి.సరిత తదితర కమిటీ సభ్యులు, పీహెచ్‌సీ వైద్యులు, ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు.

అర్చకులపై దాడికి పాల్పడ్డ వైసీపీ నేతపై చర్యలు తీసుకోవాలి

- వీహెచ్‌పీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రాజు

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 27: కాకినాడ దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులపై దాడికి పాల్పడిన వైసీపీ నేత సిరియాల చంద్రరావుపై తగిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన రాజు కోరారు. ఈ దాడికిగురైన అర్చకులను బుధవారం ఆయన పరామర్శించారు. కోనసీమ జిల్లా సంఘటన్ కార్యదర్శి గంధం గోవిందు, హైందవ వీర సంఘ అధ్యక్షుడు వరప్రసాద్ తదితరులు దేవాలయ ఈవో రాజేశ్వరరావును కలిసి న్యాయం జరిగే వరకు పోరాడాలన్నారు. పిఠాపురం, అంతర్వేది, రామతీర్థం, భీమవరంల్లో జరిగిన సంఘటనల మాదిరిగా పోలీసులు కేసును నీరుగార్చకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. పోలీసులు సరైన చర్యలు తీసుకోని పక్షంలో వీహెచ్‌పీ తరఫున ఛలో కాకినాడకు పిలుపు ఇస్తామని హెచ్చరించారు. హిందూ వ్యతిరేక ప్రభుత్వానికి త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన ఐదేళ్ల కాలంలో హిందువులు, అర్చకులు, దేవతా విగ్రహాలు, ఆలయాలపై దాడులు చేయడం అలవాటైపోయిందన్నారు. హిందువులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

కాకినాడ బీచ్‌లో టైగర్ ట్రంఫ్ విన్యాసాలు

- ఆకట్టుకున్న ఇండో-అమెరికా త్రివిధ దళాల విన్యాసాలు

7లో

పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

- వీడని పొగమంచు ప్రభావం



పిఠాపురం బైపాస్‌రోడ్డులో ఆవరించిన పొగమంచు

పిఠాపురం, మార్చి 27: పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నా పొగమంచు ప్రభావం వీడడం లేదు. వేసవి ప్రవేశించినా మంచు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేసవి తీవ్రత రోజురోజుకు అధికమవుతోంది. పగటిపూట గరిష్ఠంగా 37 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతకు ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పగటిపూట వాతావరణం ఇలా ఉంటుండగా రాత్రయ్యేసరికి చలి పెరుగుతోంది. తెల్లవారుజాము సమయంలో పొగమంచు దట్టంగా పడుతుండడంతోపాటు రహదారులు పంట పొలాలపై మంచు ఆవరిస్తోంది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు 216వ జాతీయ రహదారి మీదుగా బుధవారం ఉదయం 9గంటల వరకూ పొగమంచు కురుస్తూనే ఉంది. నెలరోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నట్లు ప్రజలు చెబుతున్నారు. పగటిపూట ఎండతీవ్రత, రాత్రి చలితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ, మంచు ప్రభావంతో ప్రజలకు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. తెల్లవారుజాము సమయంలో రహదారులపై మంచు దట్టంగా కురుస్తుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.



రంజాన్ వేళ ఆవేదన

సీఎం జగన్.. నా మైనారిటీలు అని నోటితో అంటూనే సంక్షేమం చూడకుండా నొసటితో వెక్కిరిస్తున్నట్లుగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతి వర్గాన్నీ మాటల గారడీతో మభ్యపెట్టినట్టే ముస్లింలను కూడా వంచన చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక సంక్షేమం లేదు. మసీదుల అభివృద్ధి పట్టదు. రంజాన్‌కు కానుక తీసేశారు. ఆర్థిక క్రమశిక్షణ గాడితప్పడంతో అప్పు పుడితే గానీ రోజు గడవని పరిస్థితుల వల్ల చివరికి ఇమామ్ (ప్రధాన ప్రార్థనా గురువు), మౌజన్ (సహాయ ప్రార్థనా గురువు)లకు జీతాలు కూడా సక్రమంగా చెల్లించలేని దుస్థితి దాపురించింది. దీంతో రంజాన్ వేళ ఇమామ్, మౌజన్‌లు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

- ఇమామ్, మౌజన్‌లకు 6 నెలల నుంచి భృతి లేదు
- మసీదులకు ప్రత్యేక ఆర్థిక సహాయం తీసివేత
- ముస్లింలపై వైసీపీ 'గాలి' ప్రేమ
- ఏదో చేసేస్తున్నామంటూ ఆర్భాటపు ప్రచారాలు
- క్షేత్రస్థాయిలో జరిగింది మాత్రం శూన్యం



పెంపు చూపి దగా

నాలుగేళ్లపాటు నిర్లక్ష్యం చేసి చివరి ఏడాదిలో ఎన్నికల్లో లబ్ధి లక్ష్యంగా ఇమామ్, మౌజన్‌లకు జీతాలు పెంచారు. అయితే, ఆ పెంపు చూపించి సంబర పడండంటూ ఊదరగొట్టిన వైసీపీ నాయకులు.. మరోవైపు ఉపకారాలను పీకేశారు. పేద, ధనిక అనే భేదం లేకుండా రంజాన్ ఆనందంగా జరుపుకోవాలని సంకల్పించి గత ప్రభుత్వంలో రంజాన్ వచ్చిందంటే తోఫా పేరుతో కానుక అందజేసేవారు. తోఫాలో పప్పు, ఉప్పు, సేమియాలు, నెయ్యి, పసుపు వంటి ఇఫ్తార్ వంటకు అవసరమైన వస్తువులు ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక తోఫాను తీసేసింది. దాని స్థానంలో ప్రత్యామ్నాయం కూడా ఏమీ అందజేసే ఆలోచన చేయలేదు. అలాగే గత ప్రభుత్వంలో రంజాన్ మాసం రాక ముందే మసీదుల మరమ్మతులు, రంగులు, ఎలక్ట్రికల్ తదితర పనుల కోసం నిధులు విడుదల చేసేవాళ్లు. గ్రామాల్లోని మసీదులకు రూ.15 వేలు, పట్టణాల్లోని మసీదులకు రూ.25 వేలు అందజేసేవారు. దీంతో మసీదుల్లోని చిన్నచిన్న పనులకు ఇబ్బంది ఉండేది కాదు. వైసీపీ పాలన వచ్చిన వెంటనే ఆ ఆర్థిక సహాయానికీ నీళ్లొదిలేశారు. పెళ్లి కానుక అంటూ 'దుల్హన్' పథకాన్ని తెరపైకి తెచ్చారు. అయితే సవాలక్ష నిబంధనలు విధించి నిర్వీర్యం చేసేశారు. 10 శాతం మందికి కూడా లబ్ధి చేకూరలేదు.

ప్రతి మసీదులో ఇమామ్, మౌజన్ ఉంటారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలనే తలంపుతో గత ప్రభుత్వం ప్రతి నెలా గౌరవ భృతిని ప్రవేశపెట్టింది. ఇమామ్‌కి రూ.5 వేలు, మౌజన్‌కి రూ.3 వేలు క్రమం తప్పకుండా గౌరవ భృతి అందేది. అయితే, గత ఎన్నికల సందర్భంగా అలవికాని హామీలు వల్లె వేసిన జగన్.. ఇమామ్, మౌజన్‌లకు రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తామంటూ ప్రగల్భాలు పలికారు. తీరా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మరిచిపోయారు. నాలుగేళ్ల పాటు ముస్లింలు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. ఉద్యమం చేసిన తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో ఏడాది నుంచి ఇమామ్, మౌజన్‌లకు జీతాల పెంపు జరిగింది. అయితే, ఆరు నెలల నుంచీ పెంచిన జీతాల మాట దేవుడెరుగు.. అసలు పైసా కూడా రాలేదు. దీంతో జిల్లాలోని 205 మసీదుల్లోని సుమారు 400 మంది ఇమామ్, మౌజన్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఆరు నెలల నుంచీ జీతాలు రాకపోవడంతో రంజాన్ వేళ అప్పుల కోసం తిప్పలు పడాల్సి వస్తోందని 'అల్లా సాక్షిగా' వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మమకారం గాలివాటం

వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క మసీదుకు నిధులు విడుదల జరగలేదు. గత ప్రభుత్వంలో 205 మసీదులు, 410 మంది ఇమామ్, మౌజన్‌లు ఉండగా ఐదేళ్లుగా ఈ ప్రభుత్వంలో ఒక్క అంకె వాటికి జతకాలేదు. 150 వరకూ కొత్తగా మసీదులు నిర్మించినా వాటికి ఎలాంటి సహాయమూ చేయడం లేదు. వాటిలోని ఇమామ్, మౌజన్‌లకు గౌరవ భృతి కల్పించలేదు. 2019లో రెహమత్‌నగర్‌లో రూ.90 లక్షలతో షాదీఖానా నిర్మాణానికి ఏర్పాట్లు జరిగాయి. అప్పటి ఎంపీ మురళీమోహన్ తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.25 లక్షలు ఇవ్వగా.. ప్రభుత్వం రూ.65 లక్షల సమకూర్చింది. టెండరు కూడా ఖరారు అయ్యింది. తర్వాత ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం రావడం తెలిసిందే. దీంతో రూ.65 లక్షల నిధులూ వెనక్కి తీసేసుకున్నారు. మునిసిపల్ కార్పొరేషన్‌కి జమ చేసిన రూ.25 లక్షలు దారి మళ్లిపోయాయి. ఆ తర్వాత నాలుగేళ్ల పది నెలల వరకూ షాదీఖానా ఊసేలేదు. ముస్లింలు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు ఎన్నికలకు ఇంకా నెలన్నర ఉందనగా షాదీఖానా నిర్మిస్తామంటూ వైసీపీ నేతలు బడాయి కబుర్లు చెబుతుండడంపై ముస్లింలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఖచ్చితంగా ఓట్లు దండుకునే ఎత్తుగడేనని ఆరోపిస్తున్నారు. ఇక, ఎడాపెడా కార్పొరేషన్ల పందేరంలో భాగంగా మైనారిటీ కార్పొరేషన్, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్, నూర్ బాషా కార్పొరేషన్, సంచార ముస్లిం జాతుల కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారు. కానీ ఒక్క కార్పొరేషన్‌కీ నిధులు, విధులు లేవు. ఛైర్మన్‌లకు, డైరెక్టర్లకు కార్యాలయాల్లో కుర్చీలు కూడా లేని దుస్థితి ఉంది.

సంక్షేమాన్ని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



షేక్ సుభాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్

వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచీ ముస్లిం మైనారిటీలకు ఏ రకమైనా ఆర్థిక సహాయమూ అందడం లేదు. సంక్షేమాన్నీ పట్టించుకోవడం లేదు. ఆర్థిక అభివృద్ధి ఒక్క అంగుళం కూడా ముందుకు కదల్లేదు. ఇమామ్, మౌజన్‌లకు కూడా జీతాలు సవ్యంగా ఇవ్వలేకపోతున్నారు. రంజాన్ వేళ ఇది చాలా బాధాకరమైన విషయం. ఏదొక పథకం పెట్టి ఎన్నో నిబంధనలు విధించి ఆవేదనకు గురి చేస్తున్నారు. చివరికి బరియల్ గ్రౌండ్స్‌కి ప్రహరీలకు కూడా నిధులు లేవు. గత ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమం బాగా జరిగింది. మసీదుల అభివృద్ధి శరవేగంగా జరిగింది.



సుమ రిఫైనరీస్ నుంచి కమ్ముకున్న పొగలు

సుమ రిఫైనరీస్‌లో మంటలు

చుట్టుపక్కల ఫ్యాక్టరీల సిబ్బంది, చక్రద్వారబంధం గ్రామస్థులు పరుగులు



రాజానగరం, మార్చి 27: మండలంలో చక్రద్వారబంధంలోని సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో బుధవారం మంటలు వ్యాపించడంతో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు భయంతో వణికిపోయారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడిన దట్టమైన పొగల సెగలు చక్రద్వారబంధం గ్రామాన్ని కమ్మేశాయి. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సమీపంలోని పలు ఫ్యాక్టరీ యజమానులు, కార్మికులతో పాటుగా పరుగులు తీశారు. చక్రద్వారబంధం గ్రామంలో గత 13 ఏళ్లుగా సుమ ఆయిల్ రిఫైనరీస్ ఫ్యాక్టరీ నడుస్తోంది. అనివార్య కారణాలతో గత ఏడాది కాలంగా మూతపడటంతో ఫ్యాక్టరీని నమ్ముకున్న కొంత మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేందుకు బుధవారం ఫ్యాక్టరీలోని ఒక యంత్ర పరికరానికి వెల్డింగ్ చేస్తుండగా బాయిలర్‌కు ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు భయంతో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని భయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న సంబంధిత యజమాని అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేశారు. అప్పటికే ఆకాశాన్ని అంటే రీతిలో మంటలు వ్యాపించి పరిసర గ్రామాలైన రాధేయపాలెం, కానవరం, ఫరిజల్లిపేట, రాజానగరం ప్రాంతాలకు దట్టమైన పొగలు విస్తరించడంతో ఎక్కడ ఏం జరుగుతుందో తెలియక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం, ఇన్నీస్‌పేట, అనపర్తి ప్రాంతాల నుంచి వచ్చిన మూడు అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టారు. ప్రమాదంలో ప్రాణనష్టం లేదని, రూ.35 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఏడీఏ అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు తెలిపారు.

వెండి ధ్వజస్తంభానికి కళా ప్రకర్షణ



అన్నవరం, మార్చి 27: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయంలో ప్రస్తుతమున్న వెండి ధ్వజస్తంభానికి గురువారం కళా ప్రకర్షణ గావించనున్నారు. ఈ ధ్వజస్తంభం లోపల కర్ర పుచ్చిపోయి శిథిలస్థితికి చేరడంతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలని గత ఈవో చంద్రశేఖర ఆజాద్ సంకల్పించారు. అయితే దీనిని సుమారు రూ.3.50 కోట్లతో బంగారంతో తయారు చేసేందుకు నెల్లూరుకు చెందిన ఒకదాత ముందుకొచ్చారు. బంగారు ధ్వజస్తంభం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కళా ప్రకర్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం నుంచి పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించడంతో పాటుగా హోమాలను చేపట్టి శాస్త్రోక్తంగా వెండి ధ్వజ స్తంభం బయటకు తీయనున్నారు. బంగారు ధ్వజ స్తంభవం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఏప్రిల్ 18 నుంచి ప్రారంభించి 22న ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ పండితులు తెలిపారు. 1500 వ్రత మండపంలో కార్యక్రమాలు చేయాల్సి ఉన్నందున గురువారం 1500 వ్రతం టికెట్ల విక్రయాలు నిలుపుదల చేయాలని నిర్ణయించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష

అన్నవరం, మార్చి 27: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి బుధవారం ఒకదాత రూ 1,01,000 విరాళంగా సమర్పించారు. మండపేటకు చెందిన సంకా శ్రీనివాస రంగారావు ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా ఆయన దాతను అభినందించి అంతరాలయ దర్శనం, ప్రసాదాలు అందజేశారు.



విరాళం అందిస్తున్న దాతలు

బీడు బారిన వరిచేలు

బైక్‌లు నడిపి రైతుల వినూత్న నిరసన



తాళ్లరేవు, మార్చి 27: 15 రోజులుగా సాగునీరు లేక వరిచేలు ఎండిపోతున్నా సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు బుధవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు వరిచేలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో పంట చేల్లో మోటారుసైకిల్‌పై రైతులు ప్రదర్శన చేసి నిరసన తెలియజేశారు. ఈ ప్రాంతం నుంచి ఓఎన్‌జీసీ కంపెనీకు పైపులైను ద్వారా సాగునీరు సరఫరా అవుతున్నా పంటకాలువ ద్వారా సాగునీరు పారక కాలువలు, పంటచేలు ఎండిపోతున్నాయి. సాగునీరు సరఫరా చేయకుంటే పంట దశకు వచ్చిన చేలు దెబ్బతిని రైతులు నష్టపోతారని సుమారు 40 మంది రైతులు మంగళవారం జిల్లా కలెక్టరును స్వయంగా కలసి వినతిపత్రం అందించారు. ఈ మేరకు రైతులు ఇరిగేషన్ అధికారుల రాక కోసం ఎదురుచూస్తూ వారు రాకపోవడంతో బీటలు వారిన పొలంలో బైక్ నడుపుతూ నిరసన తెలిపారు. చింతతిప్ప, పెదమాడికాపులు ప్రాంతంలో సుమారు 150 ఎకరాల్లో పంట ఎండిపోతోందని రైతులు ఆందోళన చెందారు. వంతుల వారీ విధానం శివారుకు వచ్చేసరికి వంతు సమయం అయిపోయి పూర్తిస్థాయిలో సాగునీరు అందక పంటచేలు భూమి ఎండిపోయి బీటలు తీస్తున్నాయన్నారు. ఓఎన్‌జీసీ పైపులైను ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీరు సరఫరాచేసిన ఎండిన చేలు పని చేయవని ప్రభుత్వం రైతులకు ఇన్సూరెన్స్ రాయితీను అందించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొంటున్నారు.

జిల్లాలో డ్రెడ్జింగ్‌కు అనుమతి లేదు

'తూర్పు' కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు, మార్చి 27: తూర్పుగోదావరి జిల్లాలో ఇసుక డ్రెడ్జింగ్‌కు ఎటువంటి అనుమతులు లేవని జిల్లా కలెక్టర్ కె. మాధవీలత తెలిపారు. బుధవారం కొవ్వూరు గామన్ బ్రిడ్జి మరమ్మత్తు పనులను పరిశీలించడానికి వచ్చినఆమె విలేకర్లతో మాట్లాడారు. గోదావరి వంతెనల దగ్గర నుంచి 500 మీటర్లలోపు ఇసుక తవ్వకాలు చేపట్టరాదన్నారు. 500 మీటర్లలోపు ఇసుక తవ్వకాలు, లిఫ్టింగ్ చేయరాదని ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు. పడవలపై మాన్యువల్‌గా బోట్‌మేన్ సొసైటీల ద్వారా మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. సెబ్ అడిషనల్ ఎస్పీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లి డ్రెడ్జింగ్ చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తామన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఆర్‌డీసీ ఈఈ శ్రీకాంత్, ఏఈఈ బి.ఏ. వర్మ, తహసీల్దార్ కె.మస్తాన్ పాల్గొన్నారు.

1న బీఈడీలో స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, మార్చి 27: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాలలో బీఈడీ ప్రవేశాలకు ఏప్రిల్ 1వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ బుధవారం తెలిపారు. బీఈడీ రెండేళ్ల కాల వ్యవధి కోర్సులో ప్రవేశాలకు ఆసక్తి, అర్హత గల వారు హాజరుకావాలన్నారు. రెగ్యులర్ సీట్లు 14, ఈడబ్ల్యూఎస్ 5 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. తప్పనిసరిగా బీఈడీ ఎడ్‌సెట్ 2023 ప్రవేశ పరీక్షకు హాజరై ఉండాలని తెలిపారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో ప్రభుత్వం నిర్దేశించిన రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్లు కోరే విద్యార్థులు ఏప్రిల్ 1న ఉదయం 9 గంటలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి హాజరు కావాలన్నారు. వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్లు డి.జ్యో తిర్మయి, 7093008473 లేదా యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్ర దించాలన్నారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

సామర్లకోట, మార్చి 27: సామర్లకోట పట్టణ పరిధిలో ఈటీసీ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటికి రంగులు వేస్తున్న పెయింటర్ ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ముకుందవరం గ్రామానికి చెందిన పెయింటర్ బుల్లివీర్రాజు(22) రోజూలాగే పెయింటింగ్ పనులు చేస్తుండగా సమీపంలోని 11 కేవీఏ విద్యుత్ లైన్లు చూడకుండా పెయింటింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగి విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలో ఉన్న పలువురు హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే బులివీర్రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసును సామర్లకోట పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.27.67 లక్షలు

మామిడికుదురు, మార్చి 27: మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి హుండీల ఆదాయం రూ.27,67,808 వచ్చినట్టు సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. అమలాపురం దేవదాయశాఖ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, తనిఖీదారు రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో 54 రోజులకు గాను హుండీ లెక్కింపు నిర్వహించారు. 10.300 గ్రాముల బంగారం, కిలో 150 గ్రాముల వెండి వచ్చినట్టు సహాయ కమిషనర్ తెలిపారు.

ఆకట్టుకున్న నావికాదళ విన్యాసాలు



యుద్ధ నౌకల నుంచి దాడులకు సిద్ధమవుతున్న సైన్యం



సర్పవరం జంక్షన్, మార్చి 27 : ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రంఫ్ విన్యాసాలు బుధవారం కాకినాడ సాగరతీరంలో ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికా దళం, అమెరికా (యూఎస్) యాంఫిబియాస్ విన్యాసాల్లో భాగంగా నావెల్ ఎన్‌క్లేవ్‌లో ఇరుదేశాలు సంయుక్తంగా ఎక్స్ టైగర్ ట్రంఫ్-2024 సీ ఫేజ్‌లో భాగంగా నిర్వహిస్తోన్న సైనిక విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సముద్ర తీరంలో యుద్ధం, తుపాన్లు, విపత్తు, ఆపద సమయాల్లో సముద్రం, ఆకాశయానం నుంచి ఏ విధంగా సహాయ చర్యలు అందిస్తారు, యుద్ధ సమయంలో శత్రు దేశాలపై త్రివిధ దళాలు నిర్వహించే ఎదురుదాడి తదితర వాటిపై ఇరుదేశాల సైనికులు విన్యాసాల్లో పాల్గొని సామర్థ్యాలను ప్రదర్శించారు. యుద్ధ సమయంలో శత్రుదేశాలపై ఆకాశ, భూమార్గం, సముద్ర మార్గంలో త్రివిధ దళాలు జరిపే దాడులు, ఆయుధాల పనితీరు, యుద్ధ ట్యాంకులు, యుద్ధ నౌకలు, సైనిక హెలికాప్టర్లు, జెట్ విన్యాసాలు అబ్బురపరిచాయి. బహుళ డ్రోన్లు, యాంటీ డ్రోన్ పరికరాలే కాకుండా అత్యాధునిక యుద్ధ పరికరాలతో సామర్థ్యాలను పరీక్షించారు. ఈ విన్యాసాల్లో భారత్, యూఎస్ దళాల క్రాస్ బోర్డర్ల సందర్శనలు, సైనికుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేందుకు ఉమ్మడి శిక్షణ విన్యాసాలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ విన్యాసాల్లో సుమారు 700 మంది ఆర్మీ, నేవీల త్రివిధ దళాలకు చెందిన సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. జాయింట్ ఎక్సర్‌సైజులో పాల్గొనేందుకు అమెరికా నుంచి వచ్చిన యుద్ధ విమానాలతో పాటు ఇండియాకు చెందిన విమానాలు ఆకాశంలో చక్కర్లు కొట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుధవారం నుంచి ఈనెల 30 వరకు ఎక్స్ టైగర్ ట్రంఫ్ విన్యాసాలు నిర్వహించనున్నామని, బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధించినట్లు కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో పలు పోలీస్‌స్టేషన్లకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అనపర్తి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా శివరామకృష్ణంరాజు

ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం.. మాజీ సైనికుడికి అవకాశం



అనపర్తి, మార్చి 27 : అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ తరపున బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు ములగపాటి శివరామకృష్ణంరాజు పేరును ఖరారు చేశారు. ఈ మేరకు బీజేపీ కేంద్ర పార్టీ ఓ నోట్‌ను విడుదల చేసింది. వారం పది రోజులుగా అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిత్వం టీడీపీకా బీజేపీకా అంటూ తీవ్ర చర్చ నడిచింది. అనపర్తి సీటుపై సందిగ్ధత ఏర్పడింది. ఈ సందిగ్ధతకు తెరదించుకూ బీజేపీ అధిష్ఠానం పది సీట్లలోను అనపర్తి సీటుకు బీజేపీ అభ్యర్థిని ప్రకటించింది. బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ములగపాటి రామరాజు ఏకైక కుమారుడు శివరామకృష్ణంరాజు ఉన్నత విద్యావంతుడు. తండ్రి రామరాజు 1982 నుంచి బీజేపీలో కొనసాగుతూ అనేక పదవులను నిర్వహించారు. దేశభక్తి కలిగిన శివరామకృష్ణంరాజు సుమారు 16 సంవత్సరాల క్రితం మిలటరీలో చేరి తొమ్మిది రాష్ట్రాలలో మిలటరీ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేశారు. తండ్రి ఆరోగ్య పరిస్థితుల రీత్యా ఆయన గత రెండు సంవత్సరాల క్రితం పదవీ విరమణ చేశారు. అనంతరం ఆర్ఎస్ఎస్‌లో ప్రచార ప్రముఖ్‌గా చేరి అనంతరం బీజేపీలో మండల అధ్యక్షుడిగా సేవలందించి జిల్లా మీడియా ప్యానలిస్ట్‌గా ఎదిగి రెండు సంవత్సరాలుగా అనపర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని భాగస్వామ్య పార్టీలైన టీడీపీ జనసేన పార్టీలను కలుపుకుంటూ విజయం దిశగా పయనిస్తానని చెప్పారు.

నిందితుల హక్కులను గౌరవించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి(డీఎల్ఎస్ఏ) ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నిందితులను కస్టడీలోకి తీసుకునే ముందు కారణాలను కచ్చితంగా అతడికి, కుటుంబీకులకు చట్ట ప్రకారం తెలియజేయాలని.. అతడి హక్కులకు భంగం కలగకుండా పోలీసులు వ్యవహరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి(డీఎల్ఎస్ఏ), సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏలో ప్రీ-అరెస్ట్, అరెస్ట్, రిమాండ్ దశల్లో అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, పోక్సో చట్టం, ఆంధ్రప్రదేశ్ బాధితులకు పరిహార పథకం-2015, లైంగిక వేధింపులు, ఇతర నేరాల్లోని బాధితులకు నల్సా పరిహార పథకం-2018 తదితర అంశాలపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అరెస్టయిన వ్యక్తికి విచారణ సమయంలో న్యాయవాదిని కలిసే హక్కు ఉందన్నారు. న్యాయవాదిని నియమించుకోలేని పక్షంలో డీఎల్ఎస్ఏ ద్వారా నిబంధనలు అనుసరించి ఉచిత న్యాయ సేవలు పొందే హక్కు ఉందన్నారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల పనితీరుపై పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ లాయర్లతో చర్చించారు. ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలోని తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లల విషయంలో సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా మహిళలు, పిల్లలకు శిశు గృహ, బాల సదనాలు, సంక్షేమ వసతి గృహాలు తదితర సేవల గురించి ఆ శాఖ అధికారిణి కె.విజయకుమారి వివరించారు.

'తూర్పు' ఎస్పీ జగదీశ్‌కు డీజీపీ కమెండేషన్ డిస్క్ అవార్డు



రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విధుల్లో ప్రతిభ చూపినందుకు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీశ్‌కు రాష్ట్ర స్థాయి అత్యున్నత పురస్కారం లభించింది. డీజీపీ కమెండేషన్ డిస్క్-2022 అవార్డులను ప్రకటిస్తూ ఏపీ పోలీస్ ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా స్థాయి అధికారుల విభాగంలో తూర్పు ఎస్పీ పి.జగదీశ్, సిబ్బంది విభాగంలో వన్‌టౌన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బి.సత్యానందం సిల్వర్ డిస్క్‌లు కైవసం చేసుకున్నారు. ఎస్పీకి గతేడాది కూడా సిల్వర్ డిస్క్ లభించడం గమనార్హం. జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, హెచ్‌సీలు సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.సత్యకుమార్, కె.గోవర్ధనవరప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుళ్లు ఎల్.ప్రమీల, వి.దీనాకుమారి, కానిస్టేబుల్ డి.దుర్గాప్రసాద్, ప్రభుత్వ రైల్వే పోలీసు కానిస్టేబుల్ సీహెచ్ గోపాలకృష్ణ, ఇంటెలిజెన్స్ విభాగంలో తూర్పు గోదావరి జోన్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ ఎం.భాస్క రరావు బ్రాంజ్ డిస్క్‌లకు ఎంపికయ్యారు.

జేఎన్టీయూకేలో ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్

జేఎన్టీయూకే, మార్చి 27: కాకినాడ జేఎన్టీయూకే డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో కేంద్ర విద్యాశాఖలోని నేషనల్ ఇనీషియేటివ్ ఫర్ డిజైన్ ఇన్నోవేషన్ సహకారంతో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, అక్నూ ఉపకులపతి కె.పద్మరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమానికి డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ కన్వీనర్‌గానూ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కల్యాణ మనోహర్ సమన్వయకర్తగానూ వ్యవహరించారు. విద్యార్థులు రూపొందించిన సృజనాత్మకమైన పరికరాలను ప్రదర్శించారు. వీసీలు విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి అభినందించారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను చేపట్టాలన్నారు. అనంతరం వీసీ పద్మరాజు మాట్లాడుతూ ఇటువంటి ఇన్నోవేషన్ ఫెయిర్ ద్వారా పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 200 పైగా నమూనాలను ప్రదర్శించినట్లు డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణ తెలిపారు. అత్యుత్తమమైన నమూనాలకు నగదు బహుమతిని అందజేయనున్నామన్నారు. డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇన్నోవేషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరాజు

కాకినాడ

నేడు 'డయల్ యువర్ డీఎం'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 27: కాకినాడ ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు 9959225534 నెంబర్‌కు ఫోన్ చేసి డిపో మేనేజర్‌కు తెలియజేయాలన్నారు.

నిరంకుశ వైసీపీ పాలనకు గుణపాఠం చెప్పాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు రావుల

కాకినాడ సిటీ, మార్చి 27: మతోన్మాద బీజేపీతోపాటు పొత్తు పెట్టుకున్న పార్టీలకు, నిరంకుశ వైసీపీ పాలనకు గుణపాఠం చెప్పాలని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు రావుల వెంకయ్య అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయని, విభజన హామీలు ఏ ఒక్కటి అమలు చేయని బీజేపీకి ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఎందుకు ఓటు వేయాలని ఆయన ప్రశ్నించారు. సాంబమూర్తినగర్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పీఆర్ భవన్‌లో బుధవారం సీపీఐ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రావుల వెంకయ్య మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం పేట్రేగిపోతోందన్నారు. రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకోవాలంటే బీజేపీని ఓడించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేనకు తాళికట్టి వైసీపీతో కాపురం చేస్తున్నట్టుగా బీజేపీ వైఖరి ఉందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పప్పు ఆదినారాయణ పాల్గొన్నారు.

'ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి'

కొత్తపల్లి, మార్చి 27: త్వరలో జరుగబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని కాకినాడ డీఎస్పీ కోపల్లె హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండలంలో ఉప్పాడ, నాగులాపల్లి, యండపల్లి, మూలపేట, కొత్తమూలపేట గ్రామాల్లో బుధవారం సాయుధబలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అయా ప్రధాన కూడళ్లలో డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా ఓటింగ్ పాల్గొనేందుకు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రవిత్రమైనదని, నిష్పక్షపాతంగా ధైర్యంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ట్రైనీ డీఎస్పీప్రమోద్, ట్రాఫిక్ సీఐ కృష్ణచైతన్య, పిఠాపురం సీఐ శ్రీనివాస్, కొత్తపల్లి ఎస్ఐ పీపీ స్వామినాయుడు పాల్గొన్నారు.

'కౌంటింగ్ సెంటర్లకు పటిష్ట భద్రత'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 27: కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదేశించారు. జేఎన్‌టీయూకే ఆవరణలోని సివిల్ బ్లాక్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు. ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు సూచనలు ఇచ్చారు. అంతకుముందు మెక్లారిన్ స్కూల్ ఆవరణలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌కు అదనంగా మరో 2 అదనపు స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏఆర్వో దొర, ఎలక్షన్ డీటీ సీతాపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఏఈ రమేష్‌బాబు, సర్వేయర్ ఆచార్యులు ఉన్నారు.

గోగులమ్మ, సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

విజయరాయుడుపాలెం (కరప), మార్చి 27: గ్రామంలో పునఃనిర్మించిన ఆలయాల్లో బుధవారం గ్రామదేవత గోగులమ్మతల్లి, సీతారామలక్ష్మణ సహిత అంజనేయ స్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. గ్రామసర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, అంజలిదేవి దంపతుల చేతులమీదుగా గోగులమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠగావించారు. సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ గాదం వెంకటేశ్వరరావు, దుర్గాంబ దంపతుల చేతుల మీదుగా జరిగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కురసాల సత్యనారాయణ, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, కాదా వెంకటేశ్వరరావు, నున్న వెంకటేశ్వరరావు, ఆలయకమిటీ సభ్యుడు బొండా చంటిబాబు, పేపకాయల పులేశ్వరరావు పాల్గొన్నారు.

తుని బార్ అసోసియేషన్ ఎన్నిక

తుని రూరల్, మార్చి 27: తుని బార్ అసోసియేషన్ ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా సలుకు కృష్ణ శేఖర్, ఉపాధ్యక్షుడిగా యనమల సత్యనారాయణ, సెక్రటరీగా ఏడిద గణేష్, జాయింట్ సెక్రటరీ చిత్రా రాజేష్, కోశాధికారిగా సాకా సత్తిబాబు, లైబ్రేరీ సెక్రటరీగా నారాయణాచార్యులు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా జేవీ రమణమూర్తి, లేడీ రిప్రజెంటీవ్‌గా పి.కరుణశ్రీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని సీనియర్ న్యాయవాదులు వసంతల అప్పారావు, భీమాదుల రమణ, చాగంటి వెంకట్రాజులు, వేసు వెంకట్రావు, సీహెచ్ బాలాజీ, బోనం చినబాబు, కాలిబోయిన సూరిబాబు, సీహెచ్‌వీ రమణ, బర్ల రవికుమార్ తదితరులు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

సర్పవరం జంక్షన్, మార్చి 27: కాకినాడ రూరల్ రమణయ్యపేట సంతోష్‌నగర్‌లో బర్రి నాగేశ్వరరావు-పాలెపు రామచంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌క్రాస్ వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్స్ డాక్టర్లు సాయి, చాందినీలు వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ట్రస్టీ తాతారావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు, ట్రస్టీ వీఎస్ఎన్ మూర్తి,ట్రస్ట్ మెంబర్లు రామారావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, శివశంకర్ ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ అధికారులతో సమీక్ష

జేఎన్టీయూకే, మార్చి 27: జేఎన్‌టీయూకేలోని సెనేట్‌హాల్లో జేఎన్టీయూకే, అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులతో ఎన్ఎస్ఎస్ విభాగం ఇన్‌చార్జ్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం సమీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా సమాజానికి సేవ చేస్తూనే ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ లక్ష్యాలను నెరవేర్చుకునేలా ఎన్ఎస్ఎస్ అధికారులు తోడ్పాటునందించాలన్నారు. ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు,వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేశారు. రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు రమణాజీ,కిరణ్మయి ఉన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ ప్రారంభం

తొండంగి, మార్చి 27: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ద్వారా ఇప్పటి వరకూ రు.21793 కోట్ల వ్యాపారం సాగించినట్టు ఆ బ్యాంకు ఛైర్మన్ టి.కామేశ్వర్రావు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని ఒంటిమామిడి గ్రామంలో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు 8 జిల్లాల్లో 258 శాఖల ద్వారా సేవలందిస్తోందన్నారు. 2023 డిసెంబరు నాటికి రు.9400 కోట్ల డిపాజిట్లు సేకరించామన్నారు. ఖాతాదారులకు రూ.12217 కోట్ల అప్పులు ఇచ్చామన్నారు. ఖాతా దారులకు తమ బ్యాంకు ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని వీటిని వినియోగించుకోవాలన్నారు. రాజమండ్రి రీజన్‌లో మరో 7శాఖలను ప్రారంభిస్తామన్నారు. రీజినల్ మేనేజర్ పి.శ్రీనివాస్, జిజిబిఓఏ అధ్యక్షులు వెంకటరావు, ఏ.కొత్తపల్లి మేనేజర్ చంద్రశేఖర్, నూతన బ్రాంచి మేనేజర్ మనోజ్, క్యాషియర్ శైలజ, శ్రీను పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

పెద్దాపురం, మార్చి 27: మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీమ్ స్థాపించి 9 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మాతృత్వం పేరుతో గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందించే మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు టీమ్ వ్యవస్థాపకుడు నరేష్ పెద్దిరెడ్డి తెలిపారు. ఇకపై ప్రతీ బుధవారం స్థానిక ఆసుపత్రికి వైద్యపరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు భోజన సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని ఆసుపత్రి గైనిక్ వైద్యురాలు జగదాంబ ప్రారంభించారు. 120 మంది గర్భిణులకు భోజనం ఏర్పాటుచేశారు. వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, అనూష, చేయూత స్వచ్ఛంధ సంస్థ అధినేత రవి, దేవత రాజేష్ కుమార్, చందు, కర్రి శివ , భుజంగరావు, నెల్లూరి హర్ష, లక్ష్మణ్, నవీన్ నాని, శివ, సాయినారాయణ, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏలూరులో పాదాలమ్మ జాతర

ప్రత్తిపాడు, మార్చి 27: మండలంలోని ఏలూరు గ్రామంలో పాదాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రత్తిపాడు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఏలూరు సర్పంచ్ రొంగల సత్యనారాయణ, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, అడ్డాల త్రిమూర్తులు, కొట్టేటి అబ్బులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలి గ్రామంలో నేరెళ్ళమ్మకు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మండలాధ్యక్షులు నూతి బూరయ్య మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, కోరుకొండ నూకరాజు, భద్రవరం ఎంపిటిసి సభ్యులు కొప్పుల బాబ్జీ, చందువోలు రాజా పాల్గొన్నారు.

అంబేడ్కర్ కళా ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ప్రత్తిపాడు, మార్చి 27: మండలంలోని ఏలూరు గ్రామంలో అంబేడ్కర్ కళా ప్రదర్శన పోస్టర్‌ను బుధవారం సర్పంచ్ రొంగల సత్యనారాయణ, ఎంపీటీసీ దాడిశెట్టి రాజా చక్రధర్, సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వర్రావు, గ్రామపెద్దలు ఆవిష్కరించారు. అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 9న ఏలూరులో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ బృందం అంబేడ్కర్ జీవితం, కృషిని వివరిస్తూ నృత్యరూప నాటక కళాప్రదర్శన నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కె.శివ. ఆర్.చంద్రమౌళి, ఎస్.మధు, ఎ.వీరబాబు, చంటి, అర్జున్, సత్తిబాబు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో మహిళల నిరసన

ఏలేశ్వరం, మార్చి 27: పట్టణంలో క్వారీపైటలో రోడ్డుపక్కన ఉన్న స్థలాన్ని ఆక్రమణ చేసేవారిపై చర్యలు తీసుకోవాలని మహిళలు నిరసన తెలిపారు. బుధవారం 1వ వార్డులో ఉన్న చేతి పంపు స్థలాన్ని సింహాచలం, వెంకయ్యమ్మ అనే వక్తులు ఆక్రమణ చేస్తున్నారని, చేతి పంపు పనిచెయ్యకుండా చేస్తున్నారని టౌన్‌ప్లానింగ్ అధికారి ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశ, అనిత, జ్యోతి, గంగ, మేరీ ఉన్నారు.

కూటమిని గెలిపించడమే ప్రధాన లక్ష్యం

» మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు » పలుచోట్ల కూటమి అభ్యర్థుల ప్రచారం



తుని రూరల్: తేటగుంటలో జనగళం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యనమల, ఉదయ్‌శ్రీనివాస్

తుని రూరల్, మార్చి 27: కూటమిని అఖండ మెజార్టీతో గెలిపించడమే ప్రధాన లక్ష్యంగా టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పని చేయాలని మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. కూటమి ఉమ్మడి కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ బుధవారం తేటగుంటలో రామకృష్ణుడు, తుని కూటమి అభ్యర్థి యనమల దివ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారిద్దరు విలేకర్లతో మాట్లాడారు. 3 పార్టీల శ్రేణులు సమష్టిగా పని చేసి జగన్‌ను ఇంటికి పంపించేందుకు కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో న్యాయం, ధర్మమే గెలుస్తుందని అవినీతి, అక్రమాలతో పెట్రేగిపోయిన జగన్ ఇంటికి వెళ్లడం తథ్యమన్నారు. కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి



సామర్లకోట ప్రచారంలో ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, మార్చి 27: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కేవలం టీడీపీ ప్రభుత్వమే కృషి చేసిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పట్టణం పరిధి 17వ వార్డు బళ్ళ మార్కెట్ ప్రాంతంలో జయహోబీసీ ప్రచార కార్యక్రమాన్ని రాజప్ప తనయుడు రంగనాగ్ తదితర టీడీపీ పట్టణ నాయకులతో కలిసి నిర్వహించారు. రాజప్ప మాట్లాడుతూ బీసీలకు రాజకీయ పదవులతో బాటూ వృత్తిపరమైన ఉపకరణాలు ఆదరణ పేరిట అందించి వారివారి కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యపడిందన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్‌సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. ప్రచారం పొడవునా మహిళలు మంగళహారతులతో రాజప్పకు నీరాజనాలు అందించారు. పెద్దాపురం జనసేన ఇన్‌చార్జి తుమ్మల బాబు, బీజేపీ ఇంచార్జి విత్తనాల వెంకటరమణ, 3 పార్టీల నాయకులు, కార్యకర్తలున్నారు. మాజీ కౌన్సిలర్ యెండ్రు సాయి వెంక టరమణ టీడీపీలోకి చేరగా రాజప్ప టీడీపీ కండువా కప్పి అభినందించారు.

జగన్ గ్యాంగ్‌ను తరిమికొట్టనున్న ప్రజలు

కాకినాడ సిటీ, మార్చి 27: వైసీపీ అరాచక పాలనను అంతమొందించి జగన్‌రెడ్డి గ్యాంగ్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టడానికి ప్రజలు ఎన్నికల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 5వ డివిజన్ పేర్రాజుపేట ప్రాంతంలో ఆయన పర్యటించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. జగన్ ప్రభుత్వాన్ని, వైసీపీ రౌడీ మూకల్ని తరిమికొట్టడానికి ప్రజలు ఎప్పుడో సిద్ధమయ్యారన్నారు. జగన్ మాటలు వినే పరిస్థితిలో ప్రజలు లేరని, ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, డివిజన్ నాయకులు అంబటి చిన్న, సర్వ చంద్రశేఖర్, ఏడిద చిన్న, వానపల్లి పోలీస్, దేవు జయలక్ష్మి, వీరంరెడ్డి వెంకటలక్ష్మి, వల్లపు చిన్నారి,కొల్లు కుమారి పాల్గొన్నారు.

కూటమితోనే సంక్షేమం, అభివృద్ధి

తొండంగి, మార్చి 27: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయంతో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఏకకాలంలో జరిగి అధోగతి పాలైన రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని తుని అభ్యర్థి యనమల దివ్య అన్నారు. బుధవారం తొండంగి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, కోడ వెంకట రమణ, చొక్కా అప్పారావు, బంటుపల్లి అన్వేష్, నేమాల కృష్ణ, అరిగెల నర్సింహమూర్తి, సాదనాల నూకరాజు, కొయ్యా శివ, పక్కుర్తి వంశీ, దూలం మురళీ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు

శంఖవరం, మార్చి 27: రానున్న కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ అన్నారు. వజ్రకూటం గ్రామంలో మాజీ సర్పంచ్ కీర్తి వెంకటసుభాష్ ఆధ్వర్యంలో మీఇంటికి- మీ సత్యప్రభ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటా తిరిగి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, పర్వత సురేష్, టీఎన్‌టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, మదునూరి మురళీకృష్ణంరాజు, బద్దిరమణ, గాబు సుభాష్, ఓలేటి లక్ష్మీనారాయణ, పోలం చిన్నా ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

రౌతులపూడి, మార్చి 27: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ సర్పంచ్‌లు గొల్లు పెద్దదివాణం, ఈగల సత్తిబాబు అన్నారు. ఎస్.పైడిపాలలో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. వైసీపీ పాలనపై ప్రజలు విసుగుచెందారని, చంద్రబాబు పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో గండేపల్లి శివ, కరక శ్రీను, జనసేన నేతలు నిర్ణానాగు, పోన్నాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల నవీన్ ప్రచారం

జగ్గంపేట, మార్చి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగ్గంపేట కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జ్యోతుల నెహ్రూను గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ బుధవారం సాయంత్రం జగ్గంపేట టవర్‌కాలనీలో ప్రచారం నిర్వహించారు.

వైసీపీ అభ్యర్థిని ఓడిద్దాం

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

కొత్తపల్లి, మార్చి 27: టీడీపీ, జనసేన పొత్తుతో ప్రత్యర్థి పార్టీ వైసీపీ అభ్యర్థిని చిత్తుగా ఓడిద్దామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ పిలుపునిచ్చారు. మూలపేట, అమీనబాద్ గ్రామాలకు చెందిన మత్స్యకారులతో బుధవారం ఉప్పాడ తీరప్రాంత గ్రామంలో భేటీ అయ్యారు. ఈనెల 30న జనసేన పార్టీ అధినేత కాకినాడ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని మత్స్యకార ప్రతినిధులను ఆయన కోరారు. మత్స్యకార గ్రామాల్లో టీడీపీ చాలా బలంగా ఉందని, తీరప్రాంత మత్స్యకార ఓట్లన్నీ గాజు గ్లాసుకు వేసి అత్యధిక మెజార్టీతో పవన్‌ను గెలిపించుకుందామనానరు. కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని టీడీపీ ఎప్పుడు బలపరుచుకుంటూ ఉంటామన్నారు. ఇటీవల చంద్రబాబును కలిసిన సందర్భంలో జియోట్యూబ్ విషయంపై చర్చించానని, దాన్ని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారని వర్మ మత్స్యకారులకు తెలియజేశారు. టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి పాల్గొన్నారు.

జ్యోతుల, యనమలను కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు



నెహ్రూకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

జగ్గంపేట/ తునిరూరల్/ ప్రత్తిపాడు/ మార్చి 27: రాష్ట్ర టీడీపీ కార్యదర్శిగా నూతనంగా నియమితులైన ప్రత్తిపాడు మాజీ జడ్పీటీసీ, సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ముదునూరి మురళీకృష్ణంరాజు జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూను, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. దొడ్డి పట్ల కృష్ణ, కోలా తాతబాబు, పాకనాటి వెంకటేశ్వరరావు, ముప్పన బోయిన ఏసే, కోలా సూరిబాబు పాల్గొన్నారు. టీడీపీలో రాష్ట్ర కార్యదర్శి పదవి పొందిన మురళీకృష్ణంరాజు, కాకినాడ రూరల్‌కు చెందిన వాసిరెడ్డి ఏసుదాసు టీడీపీ సీనియర్‌నేత యనమల రామకృష్ణుడును తేటగుంటలో ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. యనమలను గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

అచ్చెన్నాయుడికి సత్కారం



అచ్చెన్నాయుడిని గజమాలతో సత్కరిస్తున్న ఏసుదాసు

సర్పవరం జంక్షన్, మార్చి 27: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన వాసిరెడ్డి ఏసుదాసు బుధవారం శ్రీకాకుళంలోని రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. తనపై నమ్మకంతో జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, అచ్చెన్నాయుడు కార్యదర్శిగా నియమించారని,పార్టీ కోసం కృషి చేస్తానన్నారు.

'వైసీపీ పాలనలో అధోగతిపాలు'

గండేపల్లి, మార్చి 27: వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతిపాలు చేశారని టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలో సింగరంపాలెం, గోపాలపురంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర, మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, యువనాయకులు జాస్తి వసంత్, పరిమిబాబు, శీలామంతుల వీరబాబు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



తొండంగి: టీడీపీలో చేరినవారితో యనమల రాజేష్

తొండంగి, మార్చి 27: తొండంగి గ్రామానికి చెందిన కందా బాబ్జి, కందా మురళి, రాజు, శేషగిరి, హరిప్రసాద్, త్రిమూర్తులు, రామారావు తదితర 100 కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వారికి శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో యనమల నాగేశ్వరావు, యనమల రాజేష్, చొక్కా అప్పారావు, కుసుమంచి శోభారాణి, సత్యన్నారాయణ, సోమాల ప్రసాద్, పక్కుర్తి నూకరాజు, మాకినీడి సురేష్ ఉన్నారు. టీడీపీ నేత యనమల రాజేష్ సమక్షంలో పేకేటి చంటిబాబు, పేకేటి రాంబాబు, పేకేటి బుజ్జి,పేకేటి బాబి, కాలిన బాబూరావు తదితర వైసీపీకి చెందిన కార్యకర్తలు తమ కుటుంబ సభ్యులతో టీడీపీలో చేరారు. పిర్ల శివ తదితరులు ఉన్నారు.

బుచ్చిబాబు సమక్షంలో...

తాళ్లరేవు, మార్చి 27: తాళ్లరేవుకు చెందిన 100 మత్స్యకార కుటుంబాలు ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో నాగిడి గోవిందు, కాటాడి జగదీష్, బొడ్డు కిషోర్, ఏ.ఈశ్వరరావు, శీలం రాజు, నాగిడి లోవరాజు, పాలెపు భైరవస్వామి, గాడి సత్యవరప్రసాద్, కాలాడి భైరవస్వామి, కాలాడి భాస్కరరావు, కాలాడి సురేష్, మల్లాడి సంపత్, మల్లాడి అప్పారావు, ఓలేటి మారయ్య, సూరిబాబు, మల్లాడి శ్రీనివాసరావు, రామకృష్ణ, మదుబాబు, కొప్పాడి లోకేష్, వర్మ, చింతా చిన్న, శివ, రాజు,రత్న శివశంకర్ ఉన్నారు.

వైసీపీకి సర్పంచ్ రాజీనామా

కిర్లంపూడి, మార్చి 27: మండలంలోని గోనేడ గ్రామ పంచాయతీ సర్పంచ్ అల్లు విజయ్‌కుమార్ వైసీపీకి రాజీనామా చేసినట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం జగన్ పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. నిధులు లేక గ్రామాల్లో కనీస పనులు చేయలేక పోయామన్నారు. జగ్గంపేట వైసీపీ అభ్యర్థి తోట నరసింహం తీరు మరీ దారుణంగా ఉందని పేర్కొన్నారు. సీనియర్ నాయకులను పట్టించుకోవడంలేదని దీంతో తీవ్ర మనస్థాపానికి గురై వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానన్నారు. గ్రామ ప్రజలతో సమావేశమై తదుపరి నిర్ణయం తీసుకుంటానని విజయ్‌కుమార్ తెలిపారు.

అధికారంలోకి వచ్చేది ఉమ్మడి ప్రభుత్వమే

కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ



కరప: జనసేనలో చేరినవారితో నానాజీ

సర్పవరం జంక్షన్, మార్చి 27: సీఎం జగన్ నియంతృత్వ పాలన, ప్రజావ్యతిరేఖ విధానాలతో ప్రజలు వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలోకి రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని కాకినాడ రూరల్ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. బుధవారం జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి కిషోర్, లచ్చబాబుల ఆధ్వర్యంలో కొవ్వాడకు చెందిన వైసీపీ సీనియర్ నాయకులు ఎస్కే. భాషా, ఎస్కే. ఆలీలతో పాటూ పలువురు మాజీ వార్డు సభ్యులు గొడారిగుంటలో జనసేన పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి నానాజీ సాదరంగా ఆహ్వానించారు.

జనసేనలో పలువురి చేరిక

కరప, మార్చి 27: రజక సంఘం మండల ఉపాధ్యక్షుడు సైనవరపు భవానీశంకర్ ఆధ్వర్యంలో జనసేన నాయకుడు యాళ్ల వీరవెంకటసత్యనారాయణ సమక్షంలో మండలానికి చెందిన 50మంది తటస్థులు పంతం నానాజీని కలవగా కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేనపార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగిరెడ్డి గంగాధర్, నాయకులు బోగిరెడ్డి కొండలరావు, పేపకాయల పవన్‌కుమార్ తదితరులున్నారు.

జనసేనలోకి రమేష్



పవన్‌ను కలిసిన రమేష్

జగ్గంపేట రూరల్, మార్చి 27: జనసేన పార్టీలోకి తుమ్మలపల్లి రమేష్ ఈ నెల 30న పిఠాపురంలో పవన్ సమక్షంలో చేరనున్నట్లు పార్టీ అధికారికంగా వెల్లడించింది. మంగళగిరిలో పవన్‌కల్యాణ్‌ను తమ్మలపల్లి రమేష్ కలిశారు.

'కంటైనర్‌లో ఏముందో ప్రజలకు తెలియాలి'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 27: ఏపీ సీఎం క్యాంపు కార్యాలయంలోకి ఏ తనిఖీలు లేకుండా ప్రవేశించిన కంటైనర్‌లో ఏముందో ప్రజలకు తెలియాలని, అవసరమైతే ఎన్నికల అధికారులు దాడులు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్, దువ్వూరి సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఎందుకు తనిఖీ చేయలేదని.. ఆ కంటైనర్‌లో డబ్బు, గిఫ్టులు ఉన్నాయని ఆరోపిస్తున్నారని, వాస్తవం తెలియపరచాలని వారు డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

జగ్గంపేట, మార్చి 27: జగ్గంపేట మండలం రామవరం గ్రామ శివారున మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా వైజాగ్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం రోడ్డు దాటుతున్న సుమారు 35 ఏళ్ల వ్యక్తిని ఢీ కొట్టగా రక్తపు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియలేదు. వీర్వో ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడికి సాయం

సామర్లకోట, మార్చి 27: సామర్లకోటలో రైల్వే పార్సిల్ కాంట్రాక్టర్ బాషా అనే వ్యక్తికి బుధవారం రైల్వే స్టేషన్లో 75 ఏళ్ల వృద్ధుడు తల, గడ్డం పెరిగి, చింపిరి జుట్టుతో కాలికి పెద్దదెబ్బతో కనిపించడంతో ఆటోలో ఎక్కించుకుని పెరిగిన తల, గడ్డం వెంట్రుకలను క్షౌరం చేయించారు. మంచి దుస్తులు ధరింపజేసి కడుపునిండా భోజనం తినిపించి సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి కాలిదెబ్బకు వైద్యం చేయించారు. దీంతో బాషా చేసిన మంచి కార్యక్రమాన్ని సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరిం టెండెంట్ ఎం.రమేష్ తదితర రైల్వే అధికారులు అభినందించారు.

నాణ్యతతో ఉపాధి పనులు

రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కన్నబాబు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దాపురం, మార్చి 27: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను నాణ్యతతో నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కె.కన్నబాబు అన్నారు. మండలంలోని చినబ్రహ్మదేవం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన డీపీవో భారతీసౌజన్య జడ్పీ సీసీవో శ్రీరామచంద్రమూర్తి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మీతో కలిసి బుధవారం పరిశీలించారు. స్థానిక వేతనదారులతో మాట్లాడి ఇప్పటివరకూ జరిగిన పనులపై ఆరాతీశారు. ఆదాయం, పని దినాలు, ఉపాధి సిబ్బందికి సమకూర్చిన సౌకర్యాలపై ప్రశ్నించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీఎల్డీవో కేఎస్వీ ప్రసాద్, డీఎల్పీవో ఎం.బాలామణి, ఏపీడీలు పి.వసంతమాధవి, రమేష్, భానుప్రకాష్ ఏపీవో బి.రాజబాబు, ఈవోపీఆర్డీ కె.రాజశేఖర్, క్వాలిటీ కంట్రోల్ అధికారిణి శ్వేత పాల్గొన్నారు.

హైవేపై వాహన తనిఖీలు

గొల్లప్రోలు, మార్చి 27: కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయ రహదారిపై అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. గొల్లప్రోలు బైపాస్ వైజంక్షన్ వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలు ఆపి లోపల ఉన్న బ్యాగులు, సూట్‌కేసులు పరిశీలించారు. తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: మురారి గ్రామ శివారులో అంతర్‌జిల్లా చెక్ పోస్టు వద్ద సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ రామకృష్ణ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ వై.గంగాభవానీ వాహనాలు తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని ఆపి విస్తృతంగా తనిఖీలు చేసి ప్రయాణికులు తీసుకెళ్తున్న వస్తువుల కోసం అడిగి తెలుసుకున్నారు.

మత్స్యకార సమాఖ్య పరిశీలన

ఉప్పాడ (కొత్తపల్లి), మార్చి 27: ఉప్పాడ మత్స్యకార మహిళా సమాఖ్యను ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు బుధవారం సందర్శించారు. కాకినాడ ఐఐఎఫ్‌టీలో ఐపీఎం,ఎంబీఏ చదువుకునే ఢిల్లీ, కేరళ, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సమాఖ్యలో గ్రామైక్య సంఘంలో పొదుపు, రుణాలు, సంఘ సభ్యుల సమావేశాలు, తీర్మానాలు తదితర అంశాలను పరిశీలించారు. సమాఖ్య వీవోఏలు జగదీశ్వరి, పైడితల్లి ఉన్నారు.

'ఆదిత్య'లో వర్క్‌షాప్

గండేపల్లి, మార్చి 27: సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎంసీఏ విభాగంలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై వర్క్‌షాపు ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి ఎస్.వరప్రసాద్ నిర్వహించారు. డీన్స్, అకాడిమిక్స్ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రౌతులపూడి, మార్చి 27: రౌతులపూడి మండలంలోని పోలింగ్ కేంద్రాలను ప్రత్తిపాడు ఎన్నికల అధికారి కే. శ్రీనివాస్ పరిశీలించారు. సెల్‌సిగ్నల్ లేని ప్రాంతాలు రాఘవపట్నం, జాల్దాం, డీజే పురంలోనూ పోలింగ్ కేంద్రాల్లో వసతులు, రూట్ మ్యాప్‌లను పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది సమావేశం నిర్వహించి విధులపై అవగాహన కల్పించారు.

చలివేంద్రం ప్రారంభం

జగ్గంపేట, మార్చి 27: మండలంలోని రామవరంలో జాతీయ రహదారిపై మణికంఠ ఎంటర్ ప్రైజెస్ అధినేత రామవరం గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మండపాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దివంగత మండపాక కన్నబ్బాయి మెమోరియల్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. రాష్ట్ర టీడీపీ యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా చలివేంద్రం ప్రారంభించారు. మండపాక వెంకటాచలం, మండపాక శ్రీ బాబు, మండపాక అనిల్‌కుమార్, మండపాక శివకుమార్, మండపాక శశికుమార్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ బ్రాంచ్ ప్రారంభం

కిర్లంపూడి, మార్చి 27: జగపతినగరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ బ్యాంక్ బ్రాంచ్‌ను బుధవారం రీజనల్ మేనేజర్ మెతుకు సురేష్‌బాబు ప్రారంభించారు. మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. బ్రాంచ్ మేనేజర్ ఆర్.జ్యోతికిరణ్, క్యాషియర్ బత్తుల శ్రీకాంత్, కామేశ్వరరావు, శ్యామ్‌సింగ్, మూర్తి పాల్గొన్నారు.

